

రోగులతో రద్దీగా సామాజిక ఆరోగ్యకేంద్రం



యూరియా దోపిడీ

- బస్తాకు రూ.100 నుంచి రూ.150 వసూలు
- వ్యాపారులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

యూరియా దొరకదన్న రైతుల ఆందోళనను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మార్పీ కన్నా 50 నుంచి 60 శాతం వరకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. యూరియా 50 కిలోల బస్తాను రూ.266.50 విక్రయించాలి. అయితే వ్యాపారులు బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నకరికల్లు మండలంలోని ఓ గ్రామంలో రూ.380 నుంచి రూ.400 వరకు, మరో గ్రామంలో రూ.350 నుంచి రూ.450 వరకు ఈపూరు మండలంలోని ఓ గ్రామంలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రవాణా ఖర్చు కలుపుకుని విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలుపుతున్నారు. ముప్పాళ్ల మండలంలో విజిలెన్స్ అధికారులు ఓ షాపులో తనిఖీలు నిర్వహించగా 30 క్వింటాళ్ల యూరియా నిల్వలు అధికంగా ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. యూరియా అధిక ధరకు విక్రయించడాన్ని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

భారీగా నిల్వలు..

జిల్లాకు ఈ నెలలో 10,852 టన్నుల యూరియా అవసరమని వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అయితే ఇప్పటికే 5,400 టన్నులు విక్రయించినట్లు చెప్పారు. ఇంకా జిల్లాలో 3,500 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. 20 వ తేదీకల్లా మరో 2500 టన్నుల యూరియా నిల్వలు జిల్లాకు రానున్నాయని చెబుతున్నారు. యూరియా కోసం ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు రైతులను కోరారు.

- మారిన శ్లాబులతో ధరాభారం నుంచి ఉపశమనం
- ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు భారీగా తగ్గుదల
- పండగ ఆఫర్లు, డిస్కౌంట్లతో కొనుగోలుదారులకు కంపెనీల వల
- భారీ స్థాయిలో దసరా, దీపావళి కొనుగోళ్లు ఉంటాయని వ్యాపారుల అంచనా

పండగే.. పండగ



దసరా.. దీపావళి... చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అన్ని వర్గాలు పండుగ సంబరాల్లో మునిగితేలతాయి. అయితే ఈ సారి వ్యాపారవేత్తలు కూడా ఆనందంగా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధాని మోదీ ప్రజలపై జీఎస్టీ భారం తగ్గిస్తూ గత నెలలో ప్రకటించగా అది ఈ నెల దసరా నవరాత్రుల ఆరంభం నుంచి అమల్లోకి రానున్నది. దీంతో వివిధ వస్తువుల ధరలు భారీగా తగ్గను న్నాయి. సాధారణంగా సామాన్యుల నుంచి మధ్య వర్గాలు ఎక్కువగా దసరా, దీపావళి పండగల సంద ర్భంగా భారీగా కొనుగోళ్లు చేస్తుం టారు. ఇదే సమయంలో జీఎస్టీ శ్లాబుల మార్పు కూడా ఈ పం డుగల సమయాల్లో ఉండటం తో వివిధ కంపెనీల నిర్వాహ కులతో పాటు ఈ- కామర్స్ వెబ్‌సైట్లు పండగ ఆఫర్లు, రాయితీలు అంటూ విని యోగదారులను ఆకర్షించేందుకు సిద్ధమయ్యాయి. దీంతో అటు ధరలు తగ్గి తమకు భారం తగ్గనున్నదని వినియోగదారులు.. ఇటు భారీ కొనుగోళ్లతో ఆదాయాలు పొందవచ్చని వ్యాపారులు దసరా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తం మీద దసరా నవరాత్రుల నుంచి కొనుగోళ్ల సందడికి వినియోగదారులు, వ్యాపారులు సిద్ధమవుతున్నారు.



జీఎస్టీ తగ్గింపుతో కొనుగోళ్ల సందడి

నరసరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) టారీఫ్‌ల్లో మార్పులతో ధరలు భారీగా తగ్గనున్నాయి. భారీగా తగ్గిన జీఎస్టీ పన్నులు అమల్లోకి వచ్చే ఈ నెల 22 నుంచి ఈ తగ్గింపులు అమల్లోకి రానుండటంతో కొనుగోలుదారుల్లో దసరా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ధరల తగ్గుదలతో పాటు దసరా, దీపావళి పండగ అమ్మకాల సందర్భంగా వచ్చే భారీ రాయితీలు కూడా వినియోగదారులను ఊరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు మొదలు మధ్య తరగతి వర్గం వరకూ అందరూ పండగ అమ్మకాల కోసం ఎదురు చూస్తున్నారు. వచ్చే నెలలో ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన దసరా, దీపావళి పండగలు ఉన్నాయి. ఈ పండగల సందర్భంగా (మిగతా 8వ పేజీలో)



విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విపరీతమైన ఎండలు.. వాతావరణంలో వేడి, ఉక్కపోత.. అంతలోనే భారీ వర్షాలు.. అననుకూల వాతావరణంలో పలువురు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో అడుగంటిన పారిశుధ్యంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో గ్రామాల నుంచి రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మూడు వారాలుగా అమరావతి పరిధిలోని పలు పల్లెలు, పేదల కాలనీల్లో చిన్నారులను విషజ్వరాలు వెంటాడుతున్నాయి. స్థానిక 30 పడకల సామాజిక వైద్యా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 250 వరకు ఓపీ వచ్చింది. దీంతో వైద్యశాల ప్రాంగణం రోగులు వారి బంధువులతో కిటకిటలాడింది. చిన్నారులకు జ్వరం వస్తే నాలుగు ఐదు రోజులు వైద్యశాలలో ఉండాల్సిన పరిస్థితి నెలకుంది.



బెడ్లపై చికిత్స పొందుతున్న చిన్నారులు

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

వాతావరణ ప్రభావంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. జ్వరాల నివారణకు కాచి చల్లార్చిన మంచినీరు తాగాలన్నారు. దగ్గు జలుబు ఉన్నవారు మాస్కులు ధరించాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకుని భుజించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



సాగర్ ప్రాజెక్టు గురించి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావుకు వివరిస్తున్న అధికారులు

సాగర్‌లో కలెక్టర్, ఎస్పీ

- ప్రాజెక్టును సందర్శించిన అరుణ్‌బాబు, శ్రీనివాసరావు

విజయపురిసౌత్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను మంగళవారం కలెక్టర్ అరుణ్‌కుమార్, ఎస్పీ కంచె శ్రీనివాసరావు సందర్శించారు. సాగర్ డ్యాం క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో గురించి వారికి డీఈ మురళీధర్ వివరించారు. 420 గ్యాలరీ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంతోపాటు కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. ఏపీ నుంచి తెలంగాణకు యూరియా అక్రమంగా తరలిపోకుండా చెక్‌పోస్టు వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గురజాల ఆర్డీవో మురళి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, డ్యాం డీఈ శ్రీకాంత్, ఎస్ఐ అశోక్ కలెక్టర్ వెంట ఉన్నారు.

మట్టి ముడుపులు.. రూ.20 లక్షలు

అటవీ భూముల్లో గ్రావెల్ అక్రమ మైనింగ్



- కూటమి ప్రభుత్వంలోనూ వసూళ్లు
- నకరికల్లులో యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అధికారులు మామూళ్ల గంతలు కట్టుకోగా.. నకరికల్లు మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతి లేకుండా, అక్రమంగా జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, అటవీ, మైనింగ్‌శాఖ అధికారులకు నెలకు రూ.20 లక్షలు మామూళ్లు ముడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వకాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకాలు జరిపి ఐదేళ్లు ఆ పార్టీ నేతలు పెద్దఎత్తున మట్టి దోపిడీ సాగించగా ఇప్పుడు అదేబాటలో కూటమి నేతలు పయనిస్తున్నారు. నకరికల్లు మండలంలోని ఎర్రమట్టికి ఉన్న డిమాండ్‌ని అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఎక్కడాలేని విధంగా మండల పరిధిలోని కొండలు, అటవీ భూముల్లో ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం కళ్లకు మామూళ్ల గంతలు కట్టుకున్నదన్న విమర్శలున్నాయి. తవ్వకాలతో ఇప్పటికే త్రిపురాపురం కొండ రూపురేఖలు కోల్పోయింది. నెలవారీగా మామూళ్లు నిర్ణయించి వసూలు చేస్తున్న అధికారులు అక్రమ మైనింగ్‌కు పూర్తిగా సహకరిస్తున్నట్లు సమాచారం.



టిప్పర్ ద్వారా మట్టి తరలింపు



త్రిపురాపురం కొండల్లో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం

నాలా రద్దు.. అమల్లోకి

- ఇక పారిశ్రామిక అభివృద్ధి పరుగులు
- హర్షం వ్యక్తం చేస్తోన్న పెట్టుబడిదారులు
- పాత దరఖాస్తులకు యథావిధిగా వసూలు
- గతంలో 9 శాతం.. ఆ తర్వాత 3.. ఇప్పుడు సున్నా

మాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాన్-అగ్రికల్చరల్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ యాక్టు(ఎన్ఏఎల్ఏ)ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ఏడాది మే నెలలో కలెక్టర్ల సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాలా చట్టం రద్దుని ప్రకటించారు. ఆ తర్వాత మంత్రివర్గం ఆమోదం పొంది గవర్నర్ సంతకంతో తాజాగా నాలా చట్టం రద్దు అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఈ విషయాన్ని సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలకు తెలియజేశారు. ఇకపై వ్యవసాయేతర భూములకు ఎలాంటి ఫీజులు కట్టించుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. చట్టం అమల్లోకి రాక ముందు వచ్చిన దరఖాస్తులను మాత్రం పాత నాలా చట్టం ప్రకారమే నిర్ణీత ఫీజులు చెల్లించుకుని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ అవసరాలకు వినియోగించని భూములపై పన్ను విధించేందుకు 1963వ సంవత్సరంలోనే నాలా చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 2006లో ఒక దఫా ఈ చట్టాన్ని మార్చారు. మొదట్లో భూముల మార్కెట్ విలువపై 9 శాతం నాలా చార్జీలను వసూలు చేసేవారు. ఆ తర్వాత దీనిని మూడు శాతానికి తగ్గించారు. ఎవరైనా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించదలిస్తే తొలుత నాలా చార్జీలు చెల్లించి ఆ తర్వాతనే దరఖాస్తు చేసుకోవాలి. ఇది ఒక విధంగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన అధికారులతో చర్చించారు. నాలా చట్టం రద్దు వల్ల ఫీజుల రూపంలో ప్రభుత్వం ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది. అయినా అమరావతి రాజధాని పరిసర ప్రాంతాలు, ఇతర నియోజకవర్గాల్లో పారిశ్రామిక అభివృద్ధి జరిగే అవకాశం ఉండటంతో నాలా చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయిం తీసుకుంది. కాగా చాలామంది పాత దరఖాస్తులు కూడా కొత్త చట్టం కిందకు వస్తాయని అపోహకు గురౌతున్నారు. అయితే నాలా రద్దు చట్టంలో పెండింగ్ దరఖాస్తుల విషయాన్ని పొందుపరిచారు. పాత దరఖాస్తులను ఇంతకు ముందు ఉన్న చట్టం ప్రకారమే పరిష్కరించాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నది. అనధికార లేఅవుట్ల విషయంలో ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, జరిమానాలు, వడ్డీలు విధించొద్దన్న నిబంధన పొందుపరిచింది. నాలా రద్దు చట్టంపై త్వరలోనే రెవెన్యూ అధికారులు మండలాల వారీగా సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నాలా ఫీజు రద్దుపై పెట్టుబడిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుండ్లకమ్మ నదిలో వృథాగా పోతున్న నీరు

ఎత్తిపోతలు.. ఎదురుచూపులు

- ప్రతిపాదనల్లోనే పథకాల నిర్మాణాలు
- వృథాగా పోతోన్న గుండ్లకమ్మ వాగుల నీరు

ప్రతిపాదన పంపిన ఎత్తిపోతల పథకాల వివరాలు..

పథకం	సాగు విస్తీర్ణం
ఖమ్మంపాడు	2593
ఉప్పలపాడు	2074
కె.కొత్తపాలెం	870
ములకలూరు	667
పువ్వాడ	3178
అయినవోలు	1150
తంగేడు	12480
రాళ్లవాగు	8990
వీరపట్నం	1150

వినుకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు నదీ జలాలు వృథాగా పోతుండగా.. మరోవైపు సాగునీరు అందక రైతులు అల్లాడుతున్నారు. ఎత్తిపోతల పథకాల కోసం రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించేలా ఎక్కడికక్కడ ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు రూపొందించిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. గుండ్లకమ్మతో పాటు వాగులపై ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తే సాగు సస్యశ్యామలం చేయవచ్చు. కానీ ఈ దిశగా జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచన చేయడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. గుండ్లకమ్మ, నేంద్రవాగు, రాళ్ల వాగులపై ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తే సుమారు 31 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఇందుకు సంబంధించి సాగునీటి అభివృద్ధి సంస్థ ఐడీసీ నీటి అనుమతులతో పాటు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వినుకొండ నియోజకవర్గంలో సుమారు పదివేల ఎకరాలు సాగులోకి వచ్చేలా గుండ్లకమ్మ నదిపై ఆరు చోట్ల రూ.110 కోట్లతో ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని అంచనాలు సిద్ధం చేశారు. గురజాల నియోజకవర్గంలోని రాళ్లవాగు, తంగేడు వాగులపై సుమారు రూ.22 కోట్లతో రెండు భారీ పథకాల నిర్మించాలని ప్రతిపాదించారు. వీరపట్నం వద్ద నక్కవాగుపై 1100 ఎకరాలకు సరిపడా మరో పథకానికి రూపకల్పన వేశారు. వీటికి నిధులు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం ఐదేళ్లు కాలం గడిపేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అయినా ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేస్తే వృథాగా పోతున్న నీటితో బంగారు పంటలు పండుతాయని రైతులు చెప్తున్నారు.

చెత్త ఇస్తే .. సరుకులు ఇస్తారు
- ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మండలాలకు స్వచ్ఛ రథాలు
- ప్రతి రెండు రోజులకు ఒక గ్రామం వెళ్లేలా ప్రణాళిక

8

రేపటి నుంచి అండర్ - 19 జిల్లా జట్ల ఎంపిక

ముగ్గురిని రక్షించబోయి విద్యార్థి మృతి 6

డాక్టర్ జగదీష్ రెడ్డికి గోల్డ్ మెడల్

● గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా ప్రదానం



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న డాక్టర్ జగదీష్ రెడ్డి


గుంటూరు కార్పొరేషన్,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ పరీక్షల్లో గుంటూరుకు చెందిన డాక్టర్ ఉయ్యూరు జగదీష్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవంలో డాక్టర్ జగదీష్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రొఫెసర్ ఎంఆర్‌సీ నాయుడు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నారు. జగదీష్ రెడ్డి ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరో సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

రేపటి నుంచి అండర్ - 19 జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అండర్-19 స్కూల్ గేమ్స్ మొదటి దశ జిల్లా జట్ల ఎంపికల తేదీలను కార్యదర్శి జీ నరసింహారావు మంగళవారం తెలిపారు. జట్ల ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2007 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ నెల 11న జడ్పీ హైస్కూల్ తూములూరులో సైక్లింగ్ జట్ల ఎంపికలు, 12న నరసరావుపేటలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో ఆర్చరీ, 14న వెనిగండ్ల జడ్పీ హైస్కూల్‌లో మల్లఖంబ్, 15న నందిగామ జడ్పీ హైస్కూల్‌లో పుట్‌బాల్, సెపక్ తక్రా, చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో జూడో, గట్కా, కళరియపట్టు, బీఆర్ స్టేడియంలో కురాష్, 16న గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఉషు, స్క్వాష్, రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్‌లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, 17న నరసరావుపేటలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో రైఫిల్ షూటింగ్, బాక్సింగ్, చెస్, 18న గుంటూరు బీఆర్ స్టేడియంలో జిమ్నాస్టిక్, తైక్వాండో, 19న చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో నెట్‌బాల్, గుంటూరు బీఆర్ స్టేడియంలో టంగ్టా మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్ జట్ల ఎంపికలు జరుగుతాయని నరసింహారావు తెలిపారు.

ప్రకాశం బ్యారేజి వద్ద పెరిగిన వరద ఉధృతి

● దిగువకు 87,150 క్యూసెక్కులు
● డెల్టా కాలువలకు 16,557 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారే జి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు తదితర ప్రధాన వాగుల నుంచి 1,03,707 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 87,150 క్యూసెక్కుల నీటిని దిగు వకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,276 క్యూసె క్కులు, పశ్చిమ డెల్టాకు 6,034 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్ కాలువకు 247 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

2 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 589.10 అడుగులు ఉంది. ఇది 309.35 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 16,012 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,277 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 70,038 క్యూసెక్కుల నీటి ని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 70,038 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళ వారం 43.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 43,114 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా నాలుగు వందలు, ఒక గేటు ద్వారా 23,985 క్యూసెక్కులు నీరు మొత్తం 40,985 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమడెల్టాకు 7004 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 7004 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 57,150 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీరు రేపల్లెకాల్వకు 2024 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 761 క్యూసెక్కులనీరు పశ్చిమకాల్వకు 268 క్యూసెక్కులనీరు, నిజాంపట్నం కాల్వకు 498 క్యూసెక్కులనీరు, కొమ్మమూరుకాల్వకు 3420 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపుమార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 375 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్ట దర రూ.10,000, గరిష్టధర రూ.10,250, మోడల్‌ధర రూ.10,150 పలికాయి.కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.10,150, మోడల్‌ధర రూ.10,150 పలికాయి.

ప్రకృతి వ్యవసాయంలో ప్రతీ కార్యకర్త శిక్షకుడిగా తయారవ్వాలి

ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయకుమార్, వేదికపై సీఈఓ రామారావు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రకృతి వ్యవసాయం మిషన్ పథకం ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయంలో పనిచేసే ప్రతి కార్యకర్త మంచి శిక్షకుడిగా తయారవ్వాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్ ఆకాంక్షించారు. మంగళవారం గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన రెండో రోజు రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్త ఐసీఆర్‌పీలకు ప్రతి మూడు నెలలకోసారి శిక్షణలు అందించి వారి సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. శిక్షణ కార్యక్రమాల్లో రైతులతో పాటు మహిళా సంఘ సభ్యులు కూడా పాల్గొనాలని కోరారు. రైతులు ఏకపంటకు బదులుగా పలుపంటల విధానాన్ని అవలంబించాలని, ప్రతి రైతు పీఎండీఎస్, ఆర్‌డీఎస్ విధానాలను అమలు చేయాలని, వచ్చే ఆరు నెలల్లో ప్రతి క్యాడర్ ఒక మోడల్ మేకర్‌గా మారాలని ఆయన సూచించారు. ప్రతి మండలంలో 20 ఆదర్శ క్షేత్రాలను గుర్తించి, కొత్త మోడల్స్‌ను రైతులకు పరిచయం చేయాలని, జిల్లా మోడల్ మేకర్ ట్రైనర్స్, మెంటర్స్ రైతు శాస్త్రవేత్తలు క్రమం తప్పకుండా సీఆర్పీల క్షేత్రాలను సందర్శించాలని సూచించారు. '365 రోజులు పంటలతో పచ్చదనం ఉంచితే ప్రపంచానికే మేలు జరుగుతుంది' అని ఆయన పేర్కొన్నారు. 2027 నాటికి 2 లక్షల ఏ-గ్రేడ్ మోడల్ రైతులను తయారు చేయడమే లక్ష్యమని, ఇప్పటికే అనేక దేశాలు ప్రకృతి వ్యవసాయం వెనుక ఉన్న శాస్త్రాన్ని అంగీకరిస్తున్నాయని ఆయన అన్నారు. అనంతరం రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు మాట్లాడుతూ ప్రతి రైతు మోడల్ మేకర్‌గా మారాలని, కొత్తగా ఎంపికైన ఐసీఆర్‌పీల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, సీనియర్ సలహాదారులు రాయుడు, మురళి, థీమాటిక్ లీడ్స్, అన్ని జిల్లాల ప్రాజెక్ట్ మేనేజర్లు, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వెనుకబడిన తరగతులైన బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసి, ఏడాదిన్నర గడుస్తున్నా నేటి వరకు ఆ ఊసెత్తడం లేదని విమర్శించారు. ఏప్రిల్‌తో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగుస్తుండడంతో మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ చెబుతుందని, కానీ రాష్ట్రంలో నేటికీ కులగణనను సమగ్రంగా నిర్వహించకుండా స్థానిక ప్రాదేశిక నియోజకవర్గాల విభజన పూర్తి చేయకుండా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఎలా అమలు జరుపుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనాభా దామాషా మేరకు బీసీ సబ్‌ప్లాన్ రూపొందించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అమరావతిలో మహాత్మా జ్యోతిబా పూలే-సావిత్రిబాయి పూలే స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల ప్రధాన డిమాండ్లపై ఈ నెల 12న అన్ని జిల్లాల్లో ర్యాలీగా కలెక్టరేట్లకు వెళ్లి వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, నేతలు టీ శ్రీనివాసరావు, బత్తుల అనిల్, మద్దినేని శ్రీనివాసరావు, అన్నం శివరామయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, అన్నం పిన్నారావు, వీసం నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, రఘునాథబాబు, రాధాకృష్ణ, హేమంత్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు బీపీసీఎల్ పైపులైన్ భూసేకరణ

భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి



నకరికల్లులో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి

నకరికల్లు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు నిర్మించనున్న బీపీసీఎల్ పైపులైన్‌ల ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. చల్లగుండ్ల గ్రామంలో కొందరు రైతులు భూసేకరణ విషయంలో పరిహారం పెంచే విషయమై కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేయగా పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రైతులకు ఆమోద యోగ్యమైన పరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 308 కిలోమీటర్ల మేర ఈ పైపులైన్ నిర్మాణం జరగనున్నట్టు తెలిపారు. పలుమార్లు రైతులతో సమావేశాలు నిర్వహించి మెరుగైన పరిహారం ఇచ్చేవిధంగా నిర్ణయం తీసుకొని పనులు చేపట్టినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందన్నారు. పైపులైన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ కే పుల్లారావు, బీపీసీఎల్ ఏఈఈ పవన్, సర్వేయర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చేనేత రక్షణకు రేపటి నుంచి అధ్యయన యాత్ర

మంగళగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేనేత అధ్యయన యాత్ర నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన రిబేటు, యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ బకాయిలు కలిపి మొత్తం రూ.127.87 కోట్లు వున్నాయని తెలిపారు. బకాయిలను తక్షణమే విడుదల చేసి సహకార సంఘా లను, చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. చేనేత సహకార సం ఘాలకు పాలకవర్గ ఎన్నికలు జరపాలని, మగ్గం వున్న ప్రతి కార్మికుడి కుటుంబానికి నేతన్న భరోసా పథకం వర్తింపజేయాలని, చేనేత రిజ ర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పవర్‌లూమ్స్‌పై ని యంత్రణ విధించాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న 24 సమస్యలపై జాబితాను సిద్ధం చేసినట్టు తెలిపారు. చేనేత అధ్యయన యాత్రను ఈ నెల 11వ తేదీన కృష్ణా జిల్లా పెడనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ప్రారంభిస్తారని చెప్పారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి బత్తూరి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల గిరి, నేతలు బొడ్డు ఉమామహేశ్వరరావు, బండి నాగేంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు



గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతుల్లో మాట్లాడు తున్న సీఈఓ జ్యోతిబసు పిలుపు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

సీఈఓ జ్యోతిబసు పిలుపు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఒక ప్రణాళికను రూపొందించుకొని అభివృద్ధి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతిబసు అన్నారు. జిల్లా పరిషత్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు గ్రామాల్లో సొంతంగా నిధులు చేకూ ర్చుకునే విధానాన్ని పాటించాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అదేవిధంగా పన్నులు వసూలు విషయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. వసూళ్లలో కొన్ని గ్రామాలు వెనకబడ్డాయని వాటిని సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళా ఉత్సవాలను విజయవంతం చేయాలి

● ఆహ్వాన పత్రాలు ఆవిష్కరించిన గుంటూరు, పల్నాడు డీఈవోలు



ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న గుంటూరు డీఈవో సీవీ రేణుక, నోడల్ అధికారి విమలకుమారి, ఉర్దూ డీఐ కాసిం తదితరులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11, 12 తేదీల్లో బోయపాలెంలోని డైట్ కళాశాలలో జరిగే కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని గుంటూరు, పల్నాడు డీఈవోలు సీవీ రేణుక, ఎల్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆహ్వాన పత్రాలను గుంటూరు డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి డాక్టర్ ఎస్ విమల కుమారి కార్యక్రమం గురించి డీఈఓలకు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ అందించడం జరుగుతుందని వివరించారు. రెండు రోజులపాటు భోజన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చూడాలని సూచించారు కార్యక్రమంలో ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ కాసిం పాల్గొన్నారు.

ముగ్గురిని రక్షించబోయి విద్యార్థి మృతి



మృతుడు సాయి (ఫైల్‌ఫొటో)

బాపట్లరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ముగ్గురు యువకులను రక్షించబోయి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరించటానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు అలల ఉధృతి తట్టుకోలేక సముద్రంలోనికి వెళుతున్న క్రమంలో ఆపక్కనే స్నానం చేస్తున్న నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సాయి అనే వ్యక్తి ఆ ముగ్గుర్ని రక్షించబోయి తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నాడు. డ్రోన్ కెమెరాలతో గమనించిన పోలీసులు, గజఈతగాళ్ళు తీరంలోకి కొట్టుకుపోతున్న ఆ ముగ్గుర్ని రక్షించగా క్రింది భాగంలో ఉన్న సాయి కనిపించకపోవటంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి సాయి మృతదేహం బయటకు రావటంతో తోటిస్నేహితులు, తీరంలోని పర్యాటకులలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సాయి వివరాలు సేకరించగా విజయవాడ పట్టణానికి చెందిన సాయి (23) నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యను అభ్యసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తీరంలో స్నానాలు ఆచరించేవారు పటిష్టభద్రతను పాటిస్తూ పోలీసులు, గజఈతగాళ్ళు చూచించిన స్థాయిలో మాత్రమే స్నానాలు ఆచరించాలని పోలీసులు తెలిపారు.

బిల్లులు లేకుండా వెళ్తున్న యూరియా ఆటో స్వాధీనం



యూరియాను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

నకరికల్లు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బిల్లులు లేకుండా యూరియాను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే పుల్లారావు అన్నారు. మంగళవారం నకరికల్లు మీదుగా పిడుగురాళ్ళ వైపు వెళ్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివా సరావులు బిల్లులు లేకుండా సరఫరా అవుతున్న ఎరువులపై దృష్టి సారించాలని తహసీల్దార్ కే పుల్లారావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో వాహనా లను తనిఖీ చేస్తుండగా 20 బస్తాల యూరియా ఆటోలో వెళ్తుండటాన్ని గమ నించి తనిఖీ చేశారు. డ్రైవర్‌ను ప్రశ్నించగా కుంకలగుంట నుంచి తెలంగా ణాలోని ఓ ప్రాంతానికి తీసుకు వెళ్త న్నట్టు డ్రైవర్ తెలిపాడు. దీంతో వ్యవసా య శాఖ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు, ఏవో కే దేవదాసు, తహసీల్దార్ కే పుల్లారావు, ఏఎస్ఐ కేఏస్ఎన్ ప్రసాదులు ఆటో డ్రైవర్ సమాచారం మేరకు విచారణ చేపట్టారు. కుంకలగుంటలో విచారణ సమయంలో వీఆర్వో ఆవుల కృష్ణకుమారి, వ్యవసాయ సహాయకులు విజయ లక్ష్మి తదితరులు ఉన్నారు.

సమాజాన్ని చైతన్యపరిచిన కళాకారులు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో చైతన్యం తెచ్చేందుకు దివంగత కళాకారులు సుంకర సత్యానారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, నార్ల చిరంజీవి కృషి చేశారని, సాహిత్యవేత్త లక్కరాజు లక్ష్మణరావు చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో కళాకారుల సంస్మరణ సభల్లో భాగంగా ముగ్గురు కళాకారులకు నివాళులర్పించారు. కమ్యూనిస్టు పత్రికలకు రచనలు అందించారని, వేలాది కళారూపాలను ప్రదర్శించారని తెలిపారు. మా భూమి, ముందడుగు వంటి నాటకాలు ప్రజలను ఆలోచింపజేశాయని, రాష్ట్రపతి అవార్డులు సైతం తెచ్చిపెట్టాయన్నారు. కళాకారుల స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలని కోరారు. నాగమణి, బాలస్వామి, బొల్లిముంత కృష్ణ, బెల్లంకొండ వెంకట్, బదిరినాథ్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా పయని స్తుందని డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ఎంపీపీలకు, సర్పంచులకు డివిజన్ స్థాయి శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నకరికల్లు, క్రోసూరు, మండలాల ఎంపీపీలు, సర్పంచులు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో టీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీ డీవో రెహ్మాన్, శిక్షకులు ప్రదీప్ కుమార్, ఏసోబు, సదాశివకుమారి, సురేఖ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మరుగుదొడ్డి నిర్మాణం

● కమిషనర్ వేణుబాబు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సబ్సిడీ ద్వారా మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇందుకోసం ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా...

● కారంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు మంగళవారం శ్రీవాసవీ సేవ అన్న ప్రసాద కమిటీ ఆధ్వర్యాన అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సముద్రాల పుల్లారావు, తులశమ్మ దంపతుల కుమారుడు ప్రకాష్ (యూఎస్ఏ), రేణుక దంపతులు, శృతి, శ్రీకర్ సహకారంతో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ వ్యవస్థాపకుడు బి.రామారావు, చిన్నిలక్ష్మి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి: సామాజిక ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు జనచైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతికి చెందిన టీడీపీ నాయకులు పోలిశెట్టి సాయి బాబు కుటుంబసభ్యులు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

● సత్తెనపల్లి రూరల్: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ సహకారంతో మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు.

● పెదకూరపాడు: ప్రతి నెల 9వ తేదీ గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు అన్నారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 తాళ్ళూరు పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

● ముప్పాళ్ళ: మండలంలోని పలుదేవర్లపాడు పాఠశాలలో మంగళవారం జరుగుమాల జేమ్స్ తన తండ్రి ఆశీర్వాదం గుర్తుగా ప్లేట్లు, గ్లాసులు పంపిణీ అందజేశారు.

● ముప్పాళ్ళ: 10వ తేదీ బుధవారం ముప్పాళ్ళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ సుచరిత తెలిపారు.

● మాచవరం: మండలంలోని తురకపాలెంలో కండోమ్ ప్రమోషన్, సురక్షిత లైంగిక ప్రవర్తనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనుమతులు లేకున్నా వైసీపీ నేతల ర్యాలీ

● 30 యాక్ట్ అమల్లో ఉన్నా లెక్కచేయని వైనం



రోడ్డుపై ర్యాలీగా వస్తున్న వైసీపీ నేతలు

గురజాల టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండానే వైసీపీ నేతలు, కార్యకర్తలు రోడ్డెక్కి చట్టాన్ని చేతిలోకి తీసుకొని వీరంగం సృష్టించారు. మంగళవారం వైసీపీ ఆధ్వర్యాన అన్నదాత పోరు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాగా గురజాల డీఎస్పీ జగదీష్ గురజాలలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయడానికి వీల్లేదని అన్నారు. కానీ పోలీసుల ఆదేశాలను వైసీపీ నేతలు, కార్యకర్తలు లెక్కచేయకుండా మంగళవారం సుమారు వందమందికి పైగా రోడ్లపై ఈలలు, కేకలు వేస్తూ భయాందోళన వాతావరణాన్ని సృష్టించారు. ర్యాలీగా వచ్చి గురజాల ఆర్డీవో కార్యాలయంలో ఏవో సుజాతకు వినతిపత్రం అందించారు.



మాజీ ఎమ్మెల్యే పీఆర్కేకు నోటీసులు అందిస్తున్న సీఐలు ప్రభాకరరావు, నఫీజ్‌బాషా

మాజీ ఎమ్మెల్యే పీఆర్కే హౌస్ అరెస్టు

మాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నదాత - పోరుబాట చేపట్టనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మాచర్ల పోలీసులు చర్యలు తీసుకున్నారు. గురజాల డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున ముందస్తుగా పీఆర్కేను హౌస్ అరెస్టులో ఉంచారు. పట్టణ సీఐ ప్రభాకరరావు, రూరల్ సీఐ నఫీజ్ బాషాలు ఉదయాన్నే పట్టణంలోని పీఆర్కే గృహానికి చేరుకొని ఆయనకు నోటీసు అందించి సిబ్బంది కాపలాగా ఉంచారు.

అన్నదాత పోరును అడ్డుకున్న పోలీసులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. ర్యాలీకి ఎటువంటి అనుమతి లేదని, వైసీపీ నాయకు లను హౌస్ అరెస్టు చేశారు. వైసీపీ కార్యాలయానికి కూడా ఎవ్వరినీ రాకుండా అడ్డుకోవటంతో పోలీసులకు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు కొంతమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

● భోజనశాల అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మండలంలోని రామకృష్ణాపురం వద్ద ఉన్న బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ రాజ్యలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బాలికల గురుకుల పాఠశాలలో ఆమె వంటశాల, భోజనశాల, తరగతి గదులను పరిశీలించారు. వంటశాల, భోజనశాల అపరిశుభ్రంగా ఉండటంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను, వార్డెన్‌ను ప్రశ్నించారు. శుభ్రపరిచే వారు సెలవు పెట్టడంతో పరిస్థితి ఇలా ఉందని ప్రిన్సిపాల్ అనురాధ చెప్పారు. పనివారు రాకపోతే వేరే వ్యక్తులను తీసుకువచ్చి శుభ్రపరచాలి కదా? ఇలా అపరిశుభ్రంగా ఉండటం వల్ల విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలుర గురుకుల పాఠశాలలో కూడా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనాన్ని రుచి చూశారు.



బాలుర గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ సెక్రటరీ రాజ్యలక్ష్మి

వైసీపీ డ్రామాను ప్రజలు నమ్మరు: యాగంటి

మాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఢిల్లీలో యూరియా కొరత గురించి మాట్లాడే దమ్ము లేక ఏపీలో మాత్రం వీధి నాటకాలకు తెరలేపారని, వారి డ్రామాలను ప్రజలు నమ్మరని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ చేసే అన్నదాత పోరుబాట డ్రామాని రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క రైతు కూడా నమ్మడని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర నుంచి వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పిస్తున్నారన్నారు. ఆయన వెంట శ్యామరాజపురం గ్రామ సర్పంచ్ తాటి రామారావు, జి.వెంకటేశ్వర్లు, రమేష్, తిక్కాకొండలు, డి.ప్రసాద్, కృష్ణ, రఫి తదితరులు ఉన్నారు.

● రాజుపాలెం: రైతులకు సరిపడిన యూరియా సమృద్ధిగా ఉందని రైతుల ముసుగులో వైసీపీ వెధవ రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని రాజుపాలెం కూటమి నాయకులు హెచ్చరించారు. మంగళవారం రాజుపాలెంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, అనుపాలెం సొసైటీ అధ్యక్షుడు తోట నరసయ్య, సర్పంచ్ కుందూరు పేతురు, కూటమి నాయకులు వాసా వెంకటేశ్వర్లు, గుర్రాల జగన్, కణదం వెంకట్రావు, పగడాల నరసింహారావు, తదితరులు ఉన్నారు.

బోధి పాఠశాలలో ఇన్వెస్టిచర్ కార్యక్రమం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు సమీపంలోని బోధి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిచర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేలా నాయకత్వ లక్షణాలపై పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు.

'అబద్ధపు ప్రచారాలు చేస్తున్న వైసీపీ'

పెదకూరపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వక్రబుద్ధితో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎక్కడా యూరియా కొరత లేనప్పటికీ యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ నేతలు చెప్పే మాటలు రైతులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయటానికి ప్రయత్నిస్తున్న వైసీపీకి మరోసారి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలి: డిజేబుల్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి

దాచేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలని గుంటూరుకు చెందిన డిజేబుల్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి కోరారు. మంగళవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని పాతిమా మాత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆమెతో పాటు దాచేపల్లి డీటీ బ్రహ్మయ్య, వీఆర్వో యలమంద పాల్గొన్నారు.

'రైతుల కుటుంబాలను ఆదుకోవడంలో విఫలం'

ముప్పాళ్ళ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అన్నారు. మండలంలోని మాదలలో అప్పులు తీర్చే మార్గంలేక ఆత్మహత్య చేసుకున్న యర్రంశెట్టి కోటేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆత్మహత్య చేసుకున్న రైతు ల కుటుంబాలను ఆదుకున్నారని అధికారంలోకి వచ్చాక మరచిపోయారని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, పి.మహేష్ ఉన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులకు శ్రీకారం

క్రోసూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికపాడు గ్రామంలో రోడ్డు కల్వర్టు నిర్మాణ పనులకు స్థానిక గ్రామ పెద్దలు శ్రీకారం చుట్టారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొత్తూరి రవికుమార్, మండల ఎస్సీ సెల్ నాయకుడు జడ సుబ్బు ఆధ్వర్యంలో సమస్యను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారని తెలియజేశారు. కల్వర్టు నిర్మాణానికి పూనుకున్న వారిలో ఆవుల వినోద్‌కుమార్, పొత్తూరి వసంతరావు, కుంభా సాంబశివరావు, సిద్దెల దిలీప్, బయ్యవరపు సుబ్బారావు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

12వ పీఆర్‌సీని ప్రకటించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ, సత్తెనపల్లి ఏరియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

కారంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఏవో పోట్ల నరసింహారావు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డిలు అన్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో యూరియా వాడకంపై వారు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. యూరియాను స్టాక్ చేసుకోవద్దని సూచించారు. నానో యూరియాను కూడా వినియోగించుకోవచ్చన్నారు.

● పిడుగురాళ్ల: కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు మంగళవారం తుమ్మలచెరువు గ్రామంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేసుకొని వాడాలని, నిల్వ చేసుకోవద్దని సూచించారు. ఇన్‌చార్జ్ ఏవో వెంకటేష్ మాట్లాడుతూ ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నాయని, రైతులకు లేనిపోని ఆందోళన సృష్టించడం, కృత్రిమ కొరత సృష్టించినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో శ్రీవాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, వ్యవసాయ సిబ్బంది నరసయ్య, హనుమంత రావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి: నానో యూరియాను ఉపయోగించి అధిక లాభాలు పొందాలని మండల ప్రత్యేకాధికారి ఎం నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జీడీసీఎంఎస్‌లో ఎరువుల పంపిణీని ఆయన తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఏవో పోట్ల నరసింహారావుతో కలిసి పర్యవేక్షించారు.

● దుర్గి: మండల పరిధిలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు కంగారు పడవద్దని ఏవో అమీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని అడిగొప్పులలో రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● మాచవరం: మాచవరంలోని గ్రోమోర్ కేంద్రంలో రైతులకు యూరియా మంగళవారం అందజేశారు. కార్యక్రమానికి పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు హాజరై రైతులకు అందజేశారు. పిన్నెల్లి, మాచవరం, రైతు సేవాకేంద్రాల్లో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రామమ్మ, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: రైతులకు నేరుగా గ్రామా ల్లోనే యూరియా కట్టలు పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ఏవో వెంకటేష్ మంగళవారం తెలిపారు. యూరియా కట్టల పంపిణీలో భాగంగా మండలంలోని పెదగార్లపాడు, భట్రుపాలెం గ్రామాల్లో నేరుగా యూరియా కట్టల స్టాక్ ఏర్పాటు చేసి రైతులకు అందజేస్తారన్నారు. పెదగార్లపాడుకు 12.5 టన్నులు, భట్రుపాలెంకు 12.5 టన్నులు పంపిణీ చేసినట్టు తెలిపారు. దాచేపల్లికి 20 టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు తెలిపారు.

● ముప్పాళ్ళ: మండలంలో విస్తీర్ణానికి సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని మండల ప్రత్యేక అధికారి రామారావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారుల బృందం మంగళవారం నార్నెపాడు, లంకెల కూరపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో రైతులకు ఎరువులు సరిపడా ఉన్నాయనే విషయంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ నగేష్, వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు బృందంలో ఉన్నారు.

● క్రోసూరు: యూరియా వినియోగంపై రైతులకు ప్రతి గ్రామంలోను వారం రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. మంగళవారం క్రోసూరు రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్‌తో కలసి ఆయన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటనాగరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఏవో వీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ లార్వా పిచికారి

బెల్లంకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజీ పురం, మన్నెసుల్తాన్‌పాలెం, వన్నాయపాలెం గ్రామాల్లో యాంటీ లార్వా మందును మంగళవారం పిచికారి చేసినట్టు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో సానుకూలంగా స్పందించాలి

దాచేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానికంగా ఉన్న కార్మికులతో సానుకూలంగా వ్యవహరించాలని అఖిలపక్ష కూటమి నేతలు కోరారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడు సమీపంలోని శ్రీ సిమెంట్ కర్మాగారంలో పని చేస్తున్న 70మంది కార్మికులకు పని లేదంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. కౌన్సిలర్ షరీఫ్, వేముల తిరుమలకుమార్, దుర్గారావు, ఫ్యూజన్ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ట్యాంకుకు మరమ్మతులు నిర్వహించాలి

క్రోసూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ఎస్సీ కాలనీలో ఉన్న నీటి ట్యాంకుకు మరమ్మతులు నిర్వహించి, నీటిని శుభ్రపరచాలని కాలనీవాసులు మంగళవారం మండల పరిషత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ కాలనీలో నీటి ట్యాంకు మెట్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ట్యాంకును శుభ్రం చేయకపోవటం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కాలనీలోని మంచినీటి ట్యాంకుకు మరమ్మతులు చేయించి శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని వారు కోరారు.



టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మంగళవారం సాయంత్రం టీడీపీ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కూటమి పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు కార్యకర్తలు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, దరువూరి నాగేశ్వరరావు, అబ్బూరి రమేష్, అన్నదాసు వెంకట రమణయ్య, మక్కపాటి రవిచంద్ర, పచ్చ సుధీర్, మదమంచి నరసింహారావు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2018 నవంబరు 28న అమరావతికి చెందిన తురకా కిరణ్ కుమారుడు రుషికుమార్ మృతికి కారణమైన ఆటో డ్రైవర్ హుమాయున్ బాషాకు రెండు సెక్షన్‌ల క్రింద 18నెలల జైలు శిక్ష, 11వేల జరిమానా విధిస్తూ రెండో అదనపు సివిల్ జడ్జి జె.సుజిన్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళి తే తురకా కిరణ్ విజయవాడ నుంచి భార్య, కుమారుడు రుషికుమార్‌తో కలసి ద్విచక్రవాహనంపై అమరావతి వస్తున్నాడు. అమరావతి నుంచి విజయవాడ వైపు వెళ్తున్న అప్పీ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భార్య భర్తలతో పాటు కుమారుడు రుషికుమార్‌కు గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ రుషికుమార్ మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి తరపున ఏపీపీ ప్రసాద్ నాయక్ వాదనలు వినిపించగా.. న్యాయమూర్తి ఒక సెక్షన్ కింద సంవత్సరం జైలు, పది వేల రూపాయలు, రెండో సెక్షన్ కింద ఆరు నెలల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ కేసును అప్పటి ఎస్ఐ పి.అనిల్‌కుమార్ నమోదు చేశారు.

భూమిని పరిశీలించిన ఆర్డీవో మురళీకృష్ణ

దుర్గి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిలో పేలుడు పదార్థాలకు ఎన్ఓసీ జారీ చేయడానికి ప్రతిపాదించిన భూమిని మంగళవారం గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కరుణకుమార్, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నేతల ఆర్థికసాయం

మాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డుకు చెందిన జడ్డా సాగర్ మంగళవారం అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నేతలు 5వ వార్డుకు చేరుకొని సాగర్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృ తుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కట్టమూరి సతీష్, కాయితి భాస్కర్‌రెడ్డి, కంభంపాటి చంటి, బూసాని వేణు, పీరావలి, గాజుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాత తెలిపారు. మంగళవారం హైస్కూల్ విద్యార్థులను ఆమె ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. అక్టోబరులో విశాఖపట్నంలో జరిగే సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శ్వేత, సంతోష్, పీఈటీ మత్తేకుమార్, వెంకటేష్, రత్నప్రకాష్, వినేష్, చౌరరాజు తదితరులు పాల్గొన్నారు.

డైబెటాలజీ కోర్సు కన్వీనర్‌గా భరత్‌కుమార్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, ఐఎంఏ కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న డైబెటాలజీ కోర్సు కన్వీనర్ గా పిడుగురాళ్లకు చెందిన ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ ఏపీ జనరల్ సెక్రటరీ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి మురళీమోహన్ సమక్షంలో ధూళిపాళ్ల భరత్‌కుమార్‌కు కన్వీనర్‌గా నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

ఉపాధ్యాయులకు సత్కారం

క్రోసూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు హైస్కూల్ కాంప్లెక్స్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన వారిని మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జీ కృష్ణ, ఎం.గణేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సుజాన్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బాబూరావు, జానీపాల్, చిలకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మండలాలకు స్వచ్ఛ రథాలు

ప్రతి రెండు రోజులకు ఒక గ్రామం వెళ్లేలా ప్రణాళిక

నిర్వహణ బాధ్యత మండల అభివృద్ధి అధికారికి

చెత్త ఇస్తే..

చెత్త తీసుకొని సరుకులు ఇచ్చే స్వచ్ఛ రథం

సరుకులు ఇస్తారు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చెత్త తీసుకొని.. నిత్యవసర సరుకులు ఇచ్చే స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లాలో విస్తరించనున్నారు. అందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మరో ఎనిమిది మండలాలకు స్వచ్ఛ రథాలను కేటాయించేందు కు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు రం గం సిద్ధం చేస్తున్నారు. తెనాలి, పెదకాకాని, దుగ్గిరాల, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మాచర్ల మండలాలకు నూతనంగా స్వచ్ఛ రథాలను మంజూరు చేయనున్నారు. ఆ యా మండలాల్లోని మండల పరిషత్ అభివృద్ధి అధికా రికి వాహనాలకు సంబంధించిన పూర్తి బాధ్యతను అప్పగిస్తారు. మండలానికి కేటాయించిన స్వచ్ఛ రథాలను ఏ రోజు ఏ గ్రామానికి పంపాలన్న విషయాన్ని కూడా మండల పరిషత్ అభివృద్ధి అధికారి నిర్ణయించే విధంగా ఆదేశాలు జారీ చేయ నున్నారు. మండల పరిధిలోని స్వచ్ఛ రథం ప్రతి రెండు రోజులకు ఒక గ్రామం వెళ్లేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.

స్వచ్ఛ రథం అంటే....

తడి చెత్త.. పొడి చెత్త మీద ప్రజలకు ఎంత అవ గాహన కల్పించినా క్షేత్ర స్థాయిలో పెద్దగా ప్రయో జనం ఉండటం లేదన్న భావన పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల్లో ఉంది. ఈ సమ స్యను అధిగమించేందుకు స్వచ్ఛ రథం కార్యక్ర మం చేపట్టారు. స్వచ్ఛ రథం ద్వారా చెత్తను తీసుకొని నిత్యావసర వ స్తువులు అందజేస్తారు. దానివల్ల పంచాయతీ పరిధిలోని ప్రజలకు మేలు జరుగుతుంది.. చెత్త సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్న ఆలోచనతో కార్యక్రమం ప్రవేశపె ట్టారు. గుంటూరు రూరల్ మండలంలో ఈ కార్యక్రమం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అది విజయవంతం కావటంతో కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ఆర్థికంగా పరి పుష్టి కలిగిన మండలాలకు వి స్తరిం చేందుకు రంగం సిద్ధం అవుతోంది.

చెత్తంటే ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు, గాజు సీసాలు, న్యూస్ పేపర్‌లు, అట్టలు, నూనె డబ్బాలు. ఇప్పటి వరకు వీటిని వ్యర్థంగా పడేసేవాళ్లం. ఇప్పుడు ఆ వ్యర్థం అయిన వాటితోనే ఇంట్లోకి అవసరం అయ్యే నిత్యావసర వస్తువులు తీసుకోవచ్చు. కొత్తగా ప్రవేశ పెట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో చెత్తను తీసుకొని నిత్యా వసర వస్తువులు ఇస్తారు.

ఎక్కడికి వెళితే అక్కడే పోషణ



సత్తెనపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడీ కేంద్రాలకు అందించే పోషణ సరుకులు ఇక పై ఎక్కడి నుంచైనా పొందవచ్చు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్ వాడీ కేంద్రాల్లో ఏ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్రాల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే పోషన్ ట్రాకర్ యాప్‌ను ప్రవేశ పెట్టారు. ఇందులోనే మైగ్రేషన్ ఆప్షన్‌తో సరుకులు ఎక్కడి నుంచైనా పొందే వెసులుబాటు కల్పించారు. ఇన్నాళ్ళు కేంద్రాల్లో మాత్రమే లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్నారు. తద్వారా అవకతవకలకు కొంత మేర ఆస్కారం ఉంటుంది. ఇప్పటి వరకు ఇంతర ప్రాంతాలకు వలస వెళ్ళినా పోషణ సరుకులు ఇచ్చే సమ యంలో స్థానికంగా లేకుంటే ఆ నెల అందేవి కావు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు సరు కులను పక్కదారి పట్టించే వారు. దీనికి ఇప్పుడు అడ్డుకట్ట పడింది. కేంద్రాలకు రాలేని గర్భిణీలు ఎక్కడ ఉంటే అక్కడకు సమీపంలోని అంగన్ వాడీ కార్యకర్త ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి ముఖ ఆధారిత గుర్తింపు, వేలి ముద్ర వేసి పోషకాహారం పొందవచ్చు. వలస వెళ్ళిన వారు సైతం నివాసం ఉన్న చోటే అక్కడ అంగన్ వాడీ కేంద్రాలకు వెళ్ళి సరుకులు తీసుకోవచ్చు. ముందుగా సమాచారం ఇస్తే సంబంధిత ప్రాంతాల్లోని అంగన్ వాడీ కార్యకర్తలు మైగ్రేషన్ ఆప్షన్‌తో సేవలు అందిస్తారు.

పుట్టింటికి వెళ్ళినా సరుకులు తీసుకోవచ్చు
పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎం ఉమాదేవి

ఉపాధి కోసం కొందరు ఇతర జిల్లాలకు వెళ్ళి మూడు నాలుగు నెలలు అక్కడే ఉంటున్నారు. గర్భిణులు, బాలింతలు పుట్టింటికి వెళ్ళినా అక్కడ సరుకులు తీసుకోవచ్చు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల వివరాలను ఇటీవల అంగన్ వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి యాప్‌లో నమోదు చేశారని పల్నాడు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఉమాదేవి పేర్కొన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన వారు వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు. కాగా, వెంటనే 15 రోజుల సర్వే ట్రైనింగ్ చేపట్టి, పరీక్షలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని వారు తెలిపారు.

జేజేఎం పనులు

సత్వరమే పూర్తి చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు సరఫరాకు జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్‌తో కలిసి జలజీవన్ మిషన్, ఇతర పథకాల ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా



జేజేఎం పనులపై కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

పనులపై గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలోని తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, తుళ్లూరు మండలాల్లో జేజేఎం ద్వారా జరుగుతున్న నీటి సరఫరా పంపిణీ పైపులైను, నీటి వనరుల పెంపుదల, ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు మరమ్మతు పనుల పురోగతిపై గ్రామాల వారీగా అధికారులతో సమీక్షించి పనులు వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. మంచినీటి సరఫరా మెరుగుదలకు సంబంధించి అవసరమైన చిన్న, మధ్యతరహా పనులకు ప్రతిపాదనలు వారం రోజుల్లో తయారుచేసి అందిస్తే అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. పెద్ద పనులకు సంబంధించి రెండు వారాల్లో ప్రతిపాదన సిద్ధం చేసి రాష్ట్రస్థాయిలో అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు 70 నుంచి 80 శాతం పూర్తయిన వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పూర్తి అయ్యేలా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ ఆధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్ఈ కళ్యాణ్ చక్రవర్తి, డీఈఈ ఏ రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు వానిరెడ్డి జయరామయ్య, ఏఈలు, కాంట్రాక్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

● ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘాల ప్రకటన

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీలకు ఫీజుల బకాయిలు, ఇతర సమస్యలను పది రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని, నిరవధికంగా కాలేజీలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజయాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.విజయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని, డిగ్రీ కోర్సులకు ఫీజులు నిర్ణయించే అధికారం ఉన్నత విద్య కమిషన్ నుంచి యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు డిమాండ్లు పేర్కొన్నారు.

సీఎం వ్యాఖ్యల వక్రీకరణపై ప్రభుత్వం సీరియస్

● ఫేక్ వీడియో సృష్టించిన వారిపై కఠిన చర్యలు ● సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ హెచ్చరిక

గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో పురుగుమందులు, యూరియా వినియోగం తగ్గించాలంటూ రైతులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచిస్తే కొందరు ఆయన వ్యాఖ్యలను వక్రీకరించి ఫేక్ వీడియో సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ హెచ్చరించారు. ఏఐ డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం సృష్టించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. వాస్తవాలు ధ్రువీకరించకుండా ఏ సమాచారం నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందు తున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు అయినటువంటి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులను ఉద్దేశించి 'అధిక మొత్తంలో యూరియాను వాడటం, పురుగుల మందులను పిచి కారీ చేయడం ప్రజల ఆరోగ్యానికి హానికరం కాబట్టి వాటి వినియోగం తగ్గించడం కోసం డ్రోన్‌లను ఉప యోగించడం, వాటిని సబ్సిడీ మీద రైతులకు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఆలోచిస్తున్నదని' అన్నారు. అయితే కొందరు అందుకు భిన్నంగా సీబీఎన్ వార్నింగ్ టూ ఫార్మర్స్.. జైల్లో వేస్తాం అనే శీర్షికతో ఒక ఫేక్ వీడియో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారన్నారు. ఈ ఫేక్ వీడియోను సృష్టించిన వారిపై పోలీస్ శాఖ కేసు నమోదు చేసిందన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్స్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో నకిలీ (ఫేక్) వీడియోలు, మోసపూరిత కంటెంట్, తప్పుదారి పట్టించే సమాచారాన్ని సృష్టించి ప్రచారం చేయడం సైబర్ నేరం అన్నారు. సైబర్‌క్రైమ్ చట్టం ప్రకారం శిక్షార్హం అన్నారు.

ప్రజలకు సూచనలు..

తప్పుదారి పట్టించే వీడియోలను నమ్మవద్దన్నారు. అనుమానాస్పద వీడియోలు, పోస్టు లు కనపడితే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. ఫేక్ న్యూస్ ఫార్వర్డ్ చేయడం కూడా నేరమేనన్నారు. సోషల్ మీడియా ఉపయోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ ఐడీలు సృష్టించవద్దన్నారు. చిన్న తప్పిదం కూడా పెద్ద శిక్షకు దారితీస్తుందన్నారు.

ఇండియన్ స్కిల్ కాంపిటీషన్‌పై అవగాహన సదస్సు



ఇండియా స్కిల్ కాంపిటీషన్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇండియా స్కిల్ కాంపిటీషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు రిసోర్స్ పర్సన్ కే ప్రేమ్ కుమార్, నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్‌డీసీ) స్టేట్ కోఆర్డినేటర్ కే సంజీవరావు మాట్లాడుతూ ఒలంపిక్స్ క్రీడలో శిక్షణ ఎలా ఉంటుందో ఇండియన్ స్కిల్ కాంపిటీషన్ కూడా అలాగే ఉంటుందన్నారు. దీనిలో పాల్గొనే వారు 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం వీసీ చాంబర్‌లో వీసీ గంగాధర్‌రావును కలిసి ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ - 2025 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టారు రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ సింహాచలం, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వీ రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ లింగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ అండర్ 14 చాంపియన్ డుంబ్రిగుడ



బహుమతులు ప్రదానం చేస్తున్న డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల స్టేట్ స్పోర్ట్స్ మీట్ - 2025 ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం ముగిశాయి. ఈ పోటీలలో 28 ఏకలవ్య పాఠశాలల నుంచి 600 మంది బాలికలు, 692 మంది బాలురు పాల్గొన్నారు. ము ఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రెటరి ట్రైబల్ వెల్ఫేర్ మల్లికార్జున నాయక్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫే ర్ సదా భార్గవి సెక్రెటరి గురుకులం గౌతమి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్రస్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు అభినందనలు తెలి పారు. జాతీయస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులు ఒడిశాలోని రూర్కెలలో ఏకలవ్య పాఠ శాలలపోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారు లకు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. స్వర్ణ, రజిత, కాంస్య పత కాలు అందచేశారు. ఓవరాల్ అండర్ 14 చాంపియన్ డుంబ్రిగుడ, అండర్ 19 చాంపియన్ చింతూరు క్రీడాకారులను అభినందించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని పిల్లలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాలలో సంయుక్త కార్యదర్శి ప్రసాద్,శ్యామ్ పాల్గొన్నారు

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్, టెన్నిస్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అడవి తక్కెళ్ళపాడులోనున్న సబ్ స్టేషన్ ప్రాంగణంలో జరుగుతున్న ఆయా పోటీలను ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ లాంచనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో రాష్ట్రంలోని మూడు డిస్కింలకు చెందిన ఉద్యోగులతో పాటు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోల ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డైరక్టర్ మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడలు మాన సిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. శారీరక దారుఢ్యానికి కూడా క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తితో ఉద్యోగులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎమ్ (ఆపరేషన్) కె వెంకటకృష్ణ, ఆపరేషన్ ఎస్ఈలు చల్లా రమేష్ (గుంటూరు) ఎమ్ శ్రీనివాసరావు (సీఆర్ డిఏ) జీ ఆంజనేయులు (బాపట్ల), గుంటూరు-1 ఇఇ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, ఏఈ కన్‌స్ట్రక్షన్ చాగంటి వీరారెడ్డి పలువురు అధికారులున్నారు.



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్ ఇతర అధికారులు

సెమీకండక్టర్ టెక్నాలజీపై నేటి నుంచి సింపోజీఎం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఏపీ విట్ యూనివర్సిటీలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీపై సింపోజీఎం- 2025 జరుగుతుందని వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. మంగళగిరిలోని ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయంలో మంగళవారం సింపోజీఎం తాలూకా బ్రోచర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఏపీ విట్ యూనివర్సిటీ, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండి యన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఏపీ, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ (ఐటీఏ ఏపీ) సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. భారత్‌లో సెమీ కండక్టర్ అప్లికేషన్ డిజైన్, చిప్ డిజైన్ రంగాల్లో సామర్థ్యాలను పెంచుకోవలసిన అవసరం వుందని అభిప్రాయ పడ్డారు. మూడు రోజులపాటు జరిగే ఈ సింపో జీఎంలో వీసీలు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్లు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్ పాల్గొని కీ నోట్లు, టెక్నికల్ సెషన్లు, వర్క్‌షాపుల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఎఫ్ట్రానిక్స్ ఎండీ డీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వదేశీ ప్రొడక్ట్, అప్లికేషన్ డిజైన్ అవసరం ఎంతో వుందన్నారు. దిగుమ తులపై ఆధారపడకుండా దేశీయ డిజైన్ సామ ర్థ్యాలతో అధిక విలువ కలిగిన ఉద్యోగాలను మన దేశంలో సృష్టించవచ్చని, తద్వారా దేశం వికసిత్ భారత్ వైపు సాగుతుందని తెలిపారు. సెమీకండక్టర్ చిప్స్ ప్రపంచ వ్యా ప్తంగా అన్ని చోట్లా ఇమిడి వున్నాయని, నేటికీ వీటి వినియోగం జనాభా కంటే 40 రెట్లు ఎక్కువగా వుందని వివరించారు. అకడమిక్ ఫ్యాకల్టీ, విద్యార్థులు, స్థానిక ఇండస్ట్రీ ప్రతినిధులు సింపోజీఎంలో పాల్గొని నిపుణులతో నేరుగా చర్చించి సాంకేతిక ఆలోచనలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఏపీ వైస్‌చైర్మన్ నరేంద్రకు మార్, ఐటీఏఏపీ అధ్యక్షుడు ఇంద్రజిత్ పాల్గొన్నారు.



సింపోజీఎం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎఫ్ట్రానిక్స్ ఎండీ రామకృష్ణ, విట్ వీసీ కోటా రెడ్డి తదితరులు

(5వ పేజీ తరువాయి)

పండగే పండగ

గృహావసరాలకు కావాల్సిన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు కొనడం తెలుగు ప్రజల ఆనవాయితీ. ఈ పండగ సమయంలోనే టీవీలు, వాషింగ్‌మిషన్లు, రిఫ్రిజిరేటర్లు, మిక్సర్, గ్రైండర్లు, ఏసీలు, ఓవెన్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు బైక్‌లు, కార్లు కొనుగోలు చేస్తుంటారు. ప్రత్యేకించి దసరా సందర్భంగా పలువురు వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పాత వస్తువులు, వాహనాలను కొత్త వస్తువులు, వాహనాలతో రీప్లేస్ చేసేందుకు ఆసక్తి చూపుతారు. సరిగ్గా అలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా ఒక్కో వస్తువుపై రూ.2 నుంచి 15 వేల వరకూ ధర తగ్గే అవకాశం కనిపిస్తోంది.

● భారీగా తగ్గనున్న ధరలు..

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు బాగా తగ్గనున్నాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 10 శాతం వరకూ జీఎస్టీ తగ్గింది. దీంతో ఒక్కో వాహనంపై 10 నుంచి 15 వేల వరకూ ఊరట లభించినట్లే చెప్పాలి. కార్లకైతే ఈ తగ్గింపు 50 నుంచి 75వేల వరకూ తగ్గనున్నాయి. ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ శ్లాబులో ఉన్న టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్లను 18 శాతం శ్లాబుకు తగ్గించడంతో వాటి ధరలు రూ.2 నుంచి 10 వేల వరకూ తగ్గుదల కనిపించే అవకాశం ఉంది. సరిగ్గా ఈ అవకాశాన్నే వాణిజ్య సంస్థలు సొమ్ము చేసుకోవడానికి భారీ రాయితీలను ప్రకటిస్తున్నాయి.

● భారీ ఆఫర్లు.. డిస్కౌంట్లు

దసరా, దీపావళి అమ్మకాలే అన్ని వాణిజ్య సంస్థలకు కీలకం. ఈ ఒక్క పండుగ సందర్భంగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో 125 నుంచి 150 కోట్ల రూపాయల మేర అమ్మకాలు జరుగుతాయని అంచనా. కరోనా తర్వాత అమ్మకాలపై ఒకింత ప్రతికూల ప్రభావం పడింది. అయినా పండుగ అమ్మకాల విషయంలో ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదనే చెప్పాలి. అందుకు కారణం పండుగ సమయంలో వినియోగదారుడిని ఆకర్షించేలా భారీ రాయితీలు ప్రకటించడమే. ఈ సారి కూడా వాణిజ్య సంస్థలు పండగల సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ఈ-కామర్స్ దిగ్గజాలు సేల్స్ తేదీలను కూడా ప్రకటించారు. తొలుత ఈ నెల 15 నుంచి ఆఫర్ సేల్స్ ప్రారంభించాలనుకున్న సంస్థలు, కొత్త జీఎస్టీ అమలు కోసం ఈ నెల 23 వరకూ వాయిదా వేశాయి. మిగిలిన ఆఫ్‌లైన్ వాణిజ్య సంస్థలు కూడా అదేబాట పట్టాయి. ఒక్కో సంస్థ 5 నుంచి 40 శాతం వరకూ రాయితీలు ఇవ్వడమే కాకుండా, కార్డు డిస్కౌంట్లు, ఫ్రీగిఫ్టుల పేరుతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఒక్కో సంస్థ క్రెడిట్ కార్డుపై 5 నుంచి 15 వేల రూపాయల వరకూ ఇన్‌స్టెంట్ డిస్కౌంట్‌తోపాటు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లను కూడా ఇస్తున్నాయి. ఇటు జీఎస్టీ తగ్గుదల, వాటికి తోడుగా భారీ ఆఫర్లు, డిస్కౌంట్లు మధ్య తరగతి వర్గాన్నే కాకుండా, సామాన్య ప్రజానీకాన్ని కూడా ఆకర్షిస్తున్నాయి. దీంతో వారంతా ఈనెలాకరు, వచ్చే నెలలో జరిగే పండుగ అమ్మకాల్లో తమకు కావాల్సిన వస్తువుల కొనుగోలు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జీఎస్టీ తగ్గుదల కారణంగా ఈసారి అమ్మకాల్లో కనీసం 20 నుంచి 30 శాతం పెరుగుదల ఉంటుందని చెబుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

యూరియా కొరత ఉందని నాటకానికి తెర తీసిన వైసీపీ

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్


కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత ఉందని వైసీపీ నాయకులు సరికొత్త నాటకానికి తెర తీశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం విమర్శించారు. దీనిలో భాగంగా రైతు పోరుపేరిట సరికొత్త డ్రామాకి రంగం సిద్ధం చేశారని, రాష్ట్రంలో యూరియా కొరత ఉందని ఏ రైతు చెప్పనప్పటికి వైసీపీ నాయకులు కేవలం రైతులని రెచ్చగొట్టడానికి, తన పేటీఎం బ్యాచ్‌తో తప్పుడు పోస్టులు, ప్రచారం చేస్తుందన్నారు. అనంతపురంలో సూపర్ సిక్స్‌-సూపర్ హిట్ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి జడుసుకొని రైతుల పేరుతో సరికొత్త నాటకానికి తెర తీశారన్నారు. వైసీపీ కార్యకర్తలే ఖాళీ పురుగుల మందుల డబ్బాలో మద్యం పోసుకొని తాగి రైతులు ఆత్మహత్యయత్నం చేస్తున్నట్టు పెద్ద ఎత్తున వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు బాగా గమనించారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల్ని కనీసం పట్టించుకోని, రైతును దగా చేసిన జగన్ మోహన్‌రెడ్డి ఈ రోజు రైతుల పక్షాన మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు లేనివిధంగా ఈసారి అదనంగా కేంద్రం నుంచి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తీసుకొచ్చి నిల్వ ఉంచి ప్రతి రైతుకి అందిస్తుంటే ఈ లెక్కలు తెలియని జగన్‌మోహన్‌రెడ్డి పిచ్చివాగుడు వాగుతున్నారని అన్నారు. యూరియా కొరత పైన గానీ, ఉల్లి రైతుల గిట్టుబాటు ధర గురించి గాని చర్చించే దమ్ముంటే జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు.


కాకాని గ్రామంలో రైతులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు

17 వేల మెట్రిక్ టన్నుల యూరియాకు అనుమతి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

కాకాని (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారుగా 17 వేల మెట్రిక్ టన్నుల యూరియాకు అనుమతి లభించిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం, కాకాని గ్రామాల్లో యూరియాపై గ్రామస్థాయిలో అవగాహన కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులతో ముఖాముఖిగా చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ శాంతి, తహసీల్దార్ గోపాల్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారి కే.బ్రహ్మయ్య, శేషు గ్రామ రైతులు వీరప్పయ్య, రాఘవులు నాయకులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవట్నం గ్రామంలో యూరియాపై తహసీల్దార్ బండి నిర్మల ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఏవో శివ లలిత మాట్లాడుతూ యూరియా గురించి రైతులెవరూ ఇబ్బందులు పడవద్దన్నారు. రొంపిచర్ల మండలంలో యూరియా కొరత లేదన్నారు.

● శావల్యాపురం,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, కేంద్రం నుం చి రాష్ట్రానికి 17,293 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతికి జీవో జారీ చేసిందని శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో అధికారులతో కలిసి మంగళవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించి అనంతరం వారికి ఎరువులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఇన్‌చార్జి ఎంఏవో రామారావు, సొసైటీ సీఈవో నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు భరోసా కేంద్రాలు, వెల్లటూరు మార్కెట్ యార్డు నందు యూరియాను ఏవో అంకారావు పంపిణీ చేశారు. ప్రతి రైతుకు రెండు కట్టలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవ సరం మేరకే యూరియాను తీసుకోవాలని, కావాల్సినంత యూరియా రైతులకు అందుబాటులో ఉందని, దాని గురించి రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు.

● నాదెండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియాకు మండలంలో ఎలాంటి కొరత లేదని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. నాదెండ్లలో యూరియా అందు బాటుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు కావా ల్సిన యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. ఇఫ్కో, క్రిభ్కో మేనేజర్లు లోకేశ్, మధుసూదనరావులు మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్ర మంలో వ్యవసాయ అధికారి శ్రీలత, సిబ్బంది శ్రీనివాసరావు, లక్ష్మణ్ నాయక్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల, ఈపూరు గ్రామాల్లోని ఎరువుల షాపులను మంగళవారం ఏవో వెంకట్రావు, వ్యవసాయాధికారి ఆర్ రామారావులు తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మా ట్లాడుతూ యూరియా కొరత లేదన్నారు. రైతులు తమకు సరిపడ యూరియాను మాత్రమే తీసుకువెళ్లాలన్నారు. ఎవరు యూరియాను నిల్వ చేసుకోవద్దు అన్నారు.

బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌కు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

వినుకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బాడ్మింటన్ మరియు రాష్ట్రస్థాయి టెన్నికోయిట్‌లో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల లో మంగళవారం ఏర్పాటు చేసినటువంటి అభినందన సభలో ఎంపి కైన విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేత

రొంపిచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునమాక రైల్వే స్టేషన్ వద్ద గల అండర్ బ్రిడ్జిని మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి నిలిపివేస్తున్నట్టు తహసీల్దార్ బండి నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయంగా రైతు నగర్ మీదుగా వాహనాల రాకపోకలకు వీలు కల్పించినట్టు తెలిపారు.

ఘనంగా నాయనమ్మ, తాతయ్యల దినోత్సవం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నరసరావుపేట క్యాంపస్‌లో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవాన్ని నాయనమ్మలు, తాతయ్యలతో కలిసి ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నాయనమ్మ, తాతయ్యల వేషధారణలో పాల్గొని ప్రత్యేకంగా రూపొందించిన ర్యాంప్ వాక్‌లో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ సంబంధాలను బలోపేతం చేయడానికి ఎంతో ఉపయోగపడతాయని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పులేఖర్, డైరెక్టర్ నాగోతు సబిత, స్కూల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల బదిలీ ప్రక్రియను నిలిపివేయాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు, రొంపిచర్ల, ఈపూరు, శావల్యాపురం మండలాల విద్యుత్ సబ్ స్టేషన్లను నూతనంగా ఏర్పాటు చేయనున్న చిలకలూరిపేట విద్యుత్ సబ్ డివిజన్లో కలపడానికి నిరసిస్తూ విద్యుత్ సీఎండీని, విద్యుత్ శాఖ ఎస్ఈని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కలిసి వినతి పత్రం అందజేశారు. నరసరావుపేటకి కూత వేటు దూరంలో ఈ నాలుగు మండలాలు ఉన్నాయని, ఈ మండలాలను చిలకలూరిపేట సబ్ డివిజన్లో కలపడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ చూస్తూ ఊరుకోదని, అవసరం అయితే ధర్నాలు, న్యాయపోరాటానికి సైతం వెనుకాడమని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

శావల్యాపురం,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ 40వ నేత్రదాన పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వినుకొండ ప్రభుత్వాసుపత్రి కంటి వైద్యనిపుణులు గురుస్వామి ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీపాఠశాలలోని 400మంది విద్యార్థులకు మంగళవారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, భవిత రిసోర్స్‌పర్సన్ జగన్మోహన్‌రెడ్డి, ఏఎన్ఎం శ్రీలత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యూరియా కొరతపై వైసీపీది తప్పుడు ప్రచారం

● గతంలో కంటే అధికంగా నిల్వలు
● కూటమిని అభాసుపాలు చేయాలనే జగన్ కుట్రలు
● జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు


సమావేశంలో మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో యూరియా కొరత కేవలం వైసీపీ కుట్ర మాత్రమే అని మాజీ ఎమ్మెల్యే, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మండిపడ్డారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కంటే ఎక్కువగానే యూరియా నిల్వలు రైతులకు అందుబాటులో ఉంచినా కేవలం కూటమి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలన్న ఏకైక లక్ష్యంతో విషప్రచా రాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మొసలికన్నీళ్లతో రాజకీయం చేస్తున్నారన్నారు. రైతులు వాస్తవాలు గమనించాలంటూ గణాంకాలతో సహా యూరియా వివరాలు వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లా శావల్యాపురం మండలానికి 20 టన్నులే ఇచ్చారని మాట్లాడుతున్నారని, కానీ అక్కడికి ఇప్పటి వరకు 272 టన్నులు అంటే 6 వేల బస్తాలు ఇచ్చారన్నారు. బొల్లా స్వగ్రామం వేల్పూరుకు 2900 బస్తాలు ఇచ్చామన్నారు. ఆయన సొంతూరులో ఎన్ని బస్తాల యూరియా ఇచ్చారో తెలుసుకోకుండా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బొల్లా స్వగ్రామానికి 130 టన్నులు ఇచ్చామని, ప్రతి రైతు పేరు, ఫోన్ నెంబర్ నమోదై ఉందని, కావాలంటే ఎవరైనా వచ్చి పరిశీలన చేసుకోవచ్చన్నారు. వాళ్ల ఆరోపణలకు ఆధారాలు ఉంటే చూపాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, సొసైటీ చైర్మన్ పెసల వెంకట నారాయణ, బొల్లాపల్లి మండల అధ్యక్షుడు హనుమాన్ నాయక్, విను కొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాశింగ్ రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన చేపల చెరువు వేలం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకాని గ్రామంలో గల ఎంఐ ట్యాంక్ చేపల చెరువు వేలం పాట మంగళవారం గ్రామ సచివాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో మధులత ఆధ్వర్యంలో చేపట్టగా తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నరసరావుపేట ఆర్డీవో మధులత మాట్లాడుతూ గ్రామం నుంచి ఇద్దరు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో చుండి కొండలరావు, ముండ్లమూరి కోటేశ్వరరావు పోటీపడగా ప్రభుత్వ పాటను రూ.5,33,500గా నిర్ణయించారు. చివరికి ముండ్లమూరి కోటేశ్వరరావు రూ.10,10,000 పాటను గెలుచుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. జగ్గారావు, జిల్లా ఫిషరీ శాఖ అధికారి సంజీవరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు, మైనర్ ఇరిగేషన్ ఏఈ వై.కిరణ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణకుమారి, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శాంతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీ పదవికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ న్యాయవాద సంఘ కార్యాల యానికి సర్క్యులర్ వచ్చినట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నుంచి సర్క్యులర్ వచ్చింద న్నారు. ఆసక్తిగల అరు లైన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా న్యాయవాదులు కులధ్రువీ కరణ పత్రం, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో బయోడేటాతో మూడు దరఖాస్తులను న్యాయవాద సంఘ కార్యాలయంలో సమర్పించవలసిందిగా ఆయన తెలిపారు. ఈనెల 19వ తేదీన సదరు దరఖాస్తులను 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీకు అందజేస్తా మన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజారు పులుపులవారి వీధిలో ఉన్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రాతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణం కోసం అనపర్తి వాస్తవ్యులు, ప్రస్తుతం బెంగుళూరులో నివాసముంటున్న పీలుఖానా రాఘవ శేష రాధాకృష్ణారావు, ధర్మపత్ని సుబ్రమణ్యేశ్వరి రూ.1,00,116ల విరాళాన్ని బ్యాంకు ద్వారా దేవస్థాన కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జాయింట్ సెక్రటరీ సబ్నీవీసు వెంకటరమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటలకు అవసరం మేర యూరియా సరఫరా చేయాలి

● మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, రజిని, బొల్లా డిమాండ్

నరసరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అనుమతులు లేవని పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. పోలీసుల ఆంక్షలు ఉన్నా అన్నదాత పోరు నిర్వహించారు. రైతుల అవసరాల మేర యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో మధులతకు మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు వినతి పత్రం అందజేశారు. జిల్లాకు 30వేల టన్నుల యూరియా సరఫరా చేసినట్టు చెబుతున్న అధికారులు ఎవరికి ఎంత ఇచ్చారో లెక్కలు చెప్పాలని డాక్టర్ గోపిరెడ్డి డిమాండ్ చేశారు. విడదల రజిని మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రైతులకు అండగా వైసీపీ ఉంటుందన్నారు.


ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు

విడదల రజిని ఇంటివద్ద హైడ్రామా

చిలకలూరిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్ట ణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని ఇంటి వద్ద మంగళవారం హైడ్రామా చోటు చేసుకుంది. రజిని ఇంటి చుట్టూ పోలీసులు మోహరించారు. నరసరావుపేటలో వైసీపీ ఆధ్వ ర్యంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకై సిద్ధమైన రజనీకి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆ కార్యక్రమంలో పాల్గొనేందు కు నరసరావుపేట వెళ్లడానికి, ర్యాలీలకు అనుమతిలేదని, హౌస్ అరెస్టు చేస్తున్నామని ప్రకటించారు. నోటీసులు అందుకున్న రజిని పోలీసులపై మండిపడ్డారు. నోటీసులో ఎక్కడ హౌస్ అరెస్టు ప్రస్తావన లేకపోయినప్పటికీ హౌస్ అరెస్టు ఎలా చేస్తారని ఆమె పోలీసులను ప్రశ్నించారు. నోటీసులో ఉన్న నిబంధనలను తాము పాటిస్తామని ఆమె చెప్పారు. ర్యాలీగా కాకుండా ఒకటి రెండు కార్లలో నరసరావుపేట కు వెళ్తామని పోలీసులతో అన్నారు. దీనితో పోలీసులు వెనక్కి తగ్గారు. అనంతరం ఆమె రెండు కార్లలో నరసరావుపేటకు తరలి వెళ్లి అక్కడి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూటమి సర్కారు ఎన్ని అడ్డంకు లు పెట్టినా రైతు సమస్యలపై తమ పోరాటం ఆగదని ఆమె చెప్పారు.


శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికే శానిటేషన్ డ్రైవ్

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను మెరుగుపరుచడం కోసమే శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని కంభంపాలెంలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి పనిచేస్తూ, సైడ్ కాలువల శుభ్రత, వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పరిశుభ్రత అనేది మనందరి బాధ్యత అని, స్వచ్ఛమైన వాతావరణం ఆరోగ్యకరమైన జీవనానికి ఆధారం అన్నారు. ఆ దిశగా అందరం కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, శానిటేషన్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్ నియామకం హర్షణీయం

● జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్తను రాష్ట్ర ప్రభుత్వ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియమించారని జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్ట ణంలోని జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ జిలానీ మాట్లాడుతూ వీరవల్లి వంశీ ప్రసన్నకుమార్‌ని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. జనసేన కార్యకర్తల తర పున పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. వీరవల్లి వంశీ ప్రసన్నకుమార్ మాట్లాడు తూ 2014 నుంచి జనసేన వలంటీర్‌గా పనిచేశామన్నారు. ఈ అవకాశం ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, కళ్యాణం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీకి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై రణభేరి జయప్రదం చేయాలి

● యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై రణభేరి జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నరసరావుపేటలోని యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యాల యంలో రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ సెప్టెంబరు 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యుటీఎఫ్ రణభేరి జయప్రదం చేయాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు, గౌరవ అధ్యక్షుడుషేక్ ఖాసీమ్ పీర, కోశాధికారి ఎం రవిబాబు, సహాధ్యక్షురాలు భాగేశ్వరీదేవి, జీ విజయసారధి, జిల్లా కార్యదర్శులు జీ ఆంజనేయులు, కే తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన కే-రిడ్జి ఇంటర్నేషనల్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లిలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ జీ.బర్నబాస్ మంగళవారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, కోచ్ శివకృష్ణ, సునీత వాణిలను స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ అభినందించారు.

కుళాయిల డబుల్ ఎంట్రీ సమస్యకు పరిష్కారం

● వాటిని రద్దు చేస్తూ కౌన్సిల్ తీర్మానం

చిలకలూరిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుళాయి కనెక్షన్లకు సంబంధించి పట్టణ ప్రజలు దశాబ్దాల తరబడి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మంగళవారం పరిష్కారమైంది. ఒకే ఇంటికి రెండు కుళాయి కనెక్షన్లు ఉన్నట్టు, వాస్తవంగా కుళాయి లేకపోయినా కుళాయి ఉన్నట్టు మున్సిపల్ రికార్డుల్లో నమోదై ఉంది. ఈ సమస్యపై దృష్టి సారించిన మున్సిపల్ అధికా రులు సచివాలయాల సిబ్బంది ద్వారా విచారణ చేయించారు. పట్టణంలో ఇటువంటి అసెస్మెంట్లు 293 ఉన్నాయని, వాటి డిమాండ్ల మొత్తం రూ.41.48 లక్షలు ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో డబుల్ అసెస్మెంట్ సమస్యను పరిష్కరిస్తూ తీర్మా నించారు. రెండు కుళాయి కనెక్షన్లు ఉంటే ఒక దానిని రద్దుపరుస్తున్నట్టు తీర్మానించారు. కాగా మద్దినగర్, సుభానినగర్‌లలో ఉన్న కమ్యూనిటీ హాళ్లను వినియోగంలోకి వచ్చేలా జరిపే పనులకు రూ.50 లక్షల అంచనాలను ఆమోదిస్తూ కూడా తీర్మానించారు. వార్డులలో పలు సమస్యలను కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావిం చారు. కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి నూతన 108 అంబులెన్స్

చిలకలూరిపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి ఆధునిక సౌకర్యాలు కలిగిన కొత్త 108 అంబులెన్స్ వాహనం మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి శ్రీని వాసరావు కొత్త అంబులెన్స్‌ను ప్రారంభించారు. అంబులెన్స్ అందు బాటులోకి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అసత్య ప్రచారాలతో వైసీపీ కుటిల రాజకీయం

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అసత్య ప్రచారాలతో వైసీపీ కుటిల రాజకీయం చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎరువుల సరఫరా విషయంలో సమస్యను గుర్తిం చిన ప్రభుత్వం తొలి రోజు నుంచే పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిం చగా ఇప్పటివరకు 6.11 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు వినియోగించుకు న్నారని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 1.04 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు కొనుగోలు చేశారన్నారు. డీఏపీ, ఇతర ఎరువుల వినియోగం కూడా 20 శాతం పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు సమ యానికి అందిస్తోందని, కానీ వైసీపీ మాత్రం వాస్తవాలను దాచిపెట్టి రైతులను మోసం చేస్తూ, రాజకీయ లాభం కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తుందన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ స్థితిని తెలుసుకునే క్యూఆర్ కోడ్ స్టిక్కర్ ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, కళాశాల లు, గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కల్పించడంలో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్ఐవీ స్థితిని అంచనా వేసే క్యూఆర్ కోడ్ ఆవిష్క రించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి ముఖ్యఅతిథిగా పాల్గొని క్యూఆర్ కోడ్ స్టిక్కర్ ఆవి ష్కరించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ రిస్క్ ఇన్ మినిట్స్ క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ను స్కాన్ చేయగానే ఎయిడ్స్‌కు సంబంధించి 14 ప్రశ్నలు వస్తాయన్నారు. ఆ ప్రశ్నల ద్వారా ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష ఎంతవరకు అవసరమో తెలుసుకోవచ్చు అన్నారు. తద్వారా హెచ్ఐవీ రిస్క్‌ని అంచనా వేసుకోవచ్చని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల వద్ద అంటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

యడ్లపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రతి ఒక్క రూ అవగాహనతోపాటు అప్రమత్తత కలిగి ఉండాలని చిలకలూరిపేట సీహెచ్‌సి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.హనుమంతరావు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం యడ్లపాడు సెయింట్ ఆన్స్ మహిళా జూనియర్ కళాశాలలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హెచ్ఐవీపై అవగాహన కల్పించే గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమేరి, అధ్యాపకులు ఆమని, అమూల్య, జబ్బర్, క్లస్టర్ లింక్ వర్కర్ షేక్ నాగులాబీ, మెర్సీ ఫ్లారెన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలను సందర్శించిన ఏఎంవో సుజన

నూజెండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను ఏఎంవో కే సుజన మంగళవారం సందర్శించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి, అభ్యాసన సామర్థ్యాలను సమీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై గత సంవత్సరం ఫలితాలను తెలుసుకొని ఈ ఏడాది ఐఐటీ, నీట్‌కు ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.